


## ఇంగ్లండ్ చేరుకున్న టీమ్ఇండియా

లండన్: ఐదు టెస్టుల సిరీస్ కోసం శుక్రవారం ముంబై నుంచి బయల్దేరిన భారత జట్టు.. శనివారం ఇంగ్లండ్‌కు చేరుకుంది. కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో 2025–27 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌ను ఆరంభించనున్న టీమ్ఇండియా.. జూన్ 20 నుంచి ఆతిథ్య జట్టుతో తొలి టెస్టులో తలపడనుంది. టీమ్ఇండియా క్రికెటర్లు లండన్ విమానాశ్రయానికి చేరుకున్న వీడియోను బీసీసీఐ తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో పోస్ట్ చేసింది.

## ఇంగ్లండ్‌దే తొలి టీ20

చెస్టర్ లీ స్ట్రీట్: వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌లో ఇంగ్లండ్ అదిరిపోయే బోణీ కొట్టింది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ 21 పరుగుల తేడాతో విండీస్‌పై విజయం సాధించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ముందంజ వేసింది. తొలుత జోస్ బట్లర్(59 బంతుల్లో 96, 6ఫోర్లు, 4సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో ఇంగ్లండ్ 20 ఓవర్లలో 188–6 స్కోరు చేసింది. విండీస్ బౌలర్లను ఉతికిఆరేస్తూ బట్లర్ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగాడు. అనంతరం ఛేదనకు దిగిన విండీస్.. 20 ఓవర్లలో 167–9 స్కోరు చేసింది.

# మట్టి కోర్టు మహారాణి గాఫ్

నల్ల కలువదే ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్




ఫైనల్‌లో సబలెంకపై విజయం • పురుషుల సింగిల్స్ ఫైనల్స్‌కు సిన్నర్

**మట్టి కోర్టులో కొత్త మహారాణి వచ్చింది. 21 ఏండ్ల అమెరికా యువ సంచలనం కోకో గాఫ్.. ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో రెండో సీడ్ యూఎస్ అమ్మాయి.. ప్రపంచ ఒకటో ర్యాంకర్ అరీనా సబలెంకను మట్టి కరిపించి ఈ టోర్నీలో కొత్త చరిత్ర సృష్టించింది. తొలి సెట్ ఓడినప్పటికీ ఏమాత్రం ఏకాగ్రత కోల్పోకుండా ఆడిన గాఫ్.. వరుస సెట్లలో తనకంటే మెరుగైన ర్యాంకు కలిగిన సబలెంకను చిత్తుచేసి ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలి, కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్‌ను తన ఖాతాలో వేసుకుంది.**



పారిస్: ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను అమెరికా యువ సంచలనం కోకో గాఫ్ గెలుచుకుంది. శనివారం ఫిలిప్పీ చార్టర్ కోర్టు వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్స్‌లో రెండో సీడ్ గాఫ్.. 6–7 (5/7), 6–2, 6–4తో టాప్ సీడ్ అరీనా సబలెంకపై విజయం సాధించి తన కెరీర్‌లో తొలి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ప్రపంచ నెంబర్ 1, 2 మధ్య హోరాహోరీగా జరిగిన పోరులో తొలి సెట్ ఓడినప్పటికీ తర్వాత పుంజుకున్న ఈ అమెరికా అమ్మాయి.. 2015లో సెరెనా విలియమ్స్ తర్వాత యూఎస్ నుంచి ఈ టోర్నీలో విజేతగా గెలిచిన క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. రెండున్నర గంటల పాటు సాగిన పోరులో గాఫ్.. మొదటి సెట్ ఆరంభంలో కాస్త వెనుకబడ్డా తర్వాత అనూహ్యంగా పుంజుకుంది. సబలెంక జోరుతో 4–1తో వెనుకబడ్డ ఆమె.. ఆ సెట్‌ను 6–7తో ముగించడంతో టైబ్రేక్‌కు దారితీసింది. టైబ్రేక్ మొదట్లో 4 పాయింట్లు గెలిచినా.. సబలెంక తర్వాత పుంజుకోవడంతో గాఫ్‌కు నిరాశ తప్పలేదు. కానీ రెండో సెట్ నుంచి దూకుడు పెంచిన ఆమె.. ఆ సెట్‌ను అలవోకగా గెలుచుకుంది. 32 నిమిషాల్లోనే ముగిసిన రెండో సెట్‌లో వెనుకబడ్డ సబలెంక.. ఆ తర్వాత మ్యాచ్‌పై పూర్తిగా నియంత్రణ కోల్పోయింది. గాఫ్ జోరుతో ఆమె పదేపదే తన కోచింగ్ సిబ్బంది వైపు చూస్తూ అసహనానికి లోనైంది. మరోపక్క ప్రశాంతంగా ఉంటూ వరుసగా పాయింట్లను రాబట్టిన గాఫ్.. మూడో సెట్‌నూ తన ఖాతాలో వేసుకుని కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సాధించింది. 2022లో ఇదే ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌లో ఓడిన గాఫ్.. మూడేండ్ల తర్వాత మళ్లీ ఇక్కడే ఎర్రమట్టి కోర్టు మహారాణిగా నిలవడం గమనార్హం. ఇక టోర్నీలో టైటిల్ ఫేవరెట్లలో ఒకరిగా నిలిచి సెమీస్‌లో పటిష్ఠ ప్రత్యర్థి ఇగా స్వియాటెక్‌ను ఓడించిన సబలెంక.. ఫైనల్‌లో మాత్రం గాఫ్ జోరు ముందు తలవంచక తప్పలేదు. మ్యాచ్‌లో 70 అనవసర తప్పిదాలు చేసిన ఆమె.. అందుకు భారీగా మూల్యం చెల్లించుకుంది.



**జొకోకు షాక్**

కెరీర్ 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం నొవాక్ జొకోవిచ్ మరికొంతకాలం వేచిచూడక తప్పేలా లేదు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అయినా తన కలను నెరవేర్చుకోవాలని భావించిన ఈ సెర్బియా దిగ్గజానికి సెమీస్‌లో ఒకటో సీడ్ యానిక్ సిన్నర్ (ఇటలీ) షాకిచ్చాడు. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ రెండో సెమీస్‌లో సిన్నర్.. 6–4, 7–5, 7–6 (7/3)తో జొకోను ఓడించి అతడి టైటిల్ ఆశలపై నీళ్లు చల్లాడు. వరుస సెట్లలో జొకోవిచ్‌ను ఓడించిన సిన్నర్.. ఈ టోర్నీలో ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు చేరడం విశేషం. ఈ టోర్నీలో అతడికి ఇదే తొలి ఫైనల్. సెమీస్ విజయంతో సిన్నర్.. స్పెయిన్ కుర్రాడు అల్కరాజ్‌తో ఆదివారం టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకోనున్నాడు.

**ప్రైజ్‌మనీ:**

విజేత – రూ. 24.92 కోట్లు

రన్నరప్– రూ. 12.46 కోట్లు

# భారత్‌కు పసిడి పంట

- ఒకేరోజు ఆరు స్వర్ణాలు
- అదరగొట్టిన తెలుగమ్మాయి జ్యోతి యర్రాజి



ఢిల్లీ: తైవాన్ అథ్లెటిక్స్ ఓపెన్‌లో భారత అథ్లెట్లు తొలి రోజే పసిడి పంట పండించారు. ఏకంగా ఆరు విభాగాల్లో మన అథ్లెట్లు స్వర్ణాలు గెలిచి శుభారంభం చేశారు. తెలుగమ్మాయి, జ్యోతి యర్రాజి.. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌ను 12.99 సెకన్లలోనే పూర్తిచేసి స్వర్ణం గెలిచింది. జాతీయ స్థాయిలో ఆమె రికార్డు (12.78 సెకన్లు)ను అధిగమించే అవకాశాన్ని తృటిలో కోల్పోయినా రేసులో మాత్రం ఆమె పసిడిని ముద్దాడింది. పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో తేజస్ శిర్సె.. 13. 52 సెకన్లలో గమ్యాన్ని ముద్దాడి పసిడి నెగ్గాడు. మహిళల 1500 మీటర్ల పరుగు పందెంలో పూజ (4:11.63 సెకన్లు), పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబాకర్ (16.21 మీటర్లు)కూ బంగారు పతకాలు దక్కాయి. పురుషుల 4X100 మీటర్ల రిలే టీమ్ ఈవెంట్‌లో గుర్విందర్ సింగ్, మణికంఠ, అమ్లన్, అనిమేష్‌తో కూడిన బృందం 38.75 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేసి స్వర్ణం గెలిచింది. ఇదే విభాగం మహిళల కేటగిరీలో సుదీక్ష, అభినయ, స్నేహ, నిత్య బృందం.. 44.07 సెకన్లతో రికార్డు స్థాయిలో రేసును పూర్తిచేసి గోల్డ్ మెడల్ కొట్టింది.

# నార్వే చెస్ చాంప్ కార్ల్‌సన్

- ఏడోసారి టైటిల్ సొంతం
- గుకేశ్‌కు మూడో స్థానం



స్టావెంజర్(నార్వే): ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ చాంపియన్‌షిప్‌లో స్టార్ ప్లేయర్ మాగ్నస్ కార్ల్‌సన్ మరోమారు విజేతగా నిలిచాడు. తనకు అచ్చొచ్చిన నార్వే చెస్ టోర్నీలో ఏకంగా ఏడోసారి టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. శనివారంతో ముగిసిన టోర్నీలో కార్ల్‌సన్ 16 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి క్లాసిక్ విభాగంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నాడు. టోర్నీలో వరుస విజయాలతో టైటిల్‌పై ఆశలు రేపిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ఆఖరి రౌండ్‌లో ఘోరంగా తడబడ్డాడు. అమెరికా జీఎం ఫాబియానో కరువన(15.5)తో జరిగిన చివరి రౌండ్ గేములో ఓటమి ఎదుర్కొన్న గుకేశ్ 14.5 పాయింట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యాడు. ఫాబియానోతో ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పోరులో కీలక సమయంలో చేసిన తప్పిదం వల్ల గుకేశ్ టైటిల్ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. మరోవైపు మహిళల విభాగంలో ఉక్రెయిన్‌కు చెందిన అన్నా ముజుచుక్(16.5) టైటిల్ విజేతగా నిలిచింది.




# ధోనీ రయ్ రయ్..

భారత క్రికెట్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ మరోమారు బైక్‌లపై తనకున్న మోజును చాటుకున్నాడు. రాంచీలో కవాసకీ మోటార్‌బైక్‌పై రయ్ రయ్ మంటూ దూసుకెళ్లాడు. తన స్టార్ హోదాను మరిచి సాధారణ వ్యక్తివలే ధోనీ బైక్ నడపటాన్ని సోషల్‌మీడియాలో అభిమానులు తమదైన శైలిలో ప్రశంసిస్తున్నారు.

# కేఎస్‌సీఏ కార్యదర్శి, కోశాధికారి రాజీనామా

**పోలీసులను బలి పశువులు చేశారు: కిరణ్ బేడీ**

బెంగళూరు: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మొదటి ఐపీఎల్ ట్రోఫీ విజయోత్సవ సంబురాల్లో భాగంగా చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ కర్నాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) కార్యదర్శి ఎ. శంకర్, కోశాధికారి ఈఎస్ జైరామ్ తమ పదవులకు రాజీనామా చేశారు. 11 మంది చనిపోయిన ఈ ఘటనకు గాను నైతిక బాధ్యత వహిస్తూ తమ రాజీనామాను అధ్యక్షుడు రఘురామ్ భట్‌కు పంపించారు. ఈ మేరకు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో.. 'గత రెండు రోజులుగా ఊహించని, దురదృష్టకరమైన ఘటనలు చోటు చేసుకున్నాయి. వాటిలో మా పాత్ర పరిమితమే అయినా దానికి మేం నైతిక బాధ్యత వహిస్తూ మా పదవుల నుంచి తప్పుకుంటున్నాం' అని పేర్కొన్నారు. కాగా తొక్కిసలాట ఘటనలో చనిపోయిన మృతుల కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని కర్నాటక ప్రభుత్వం రూ. 10 లక్షలనుంచి రూ. 25 లక్షలకు పెంచింది. ఇదిలాఉండగా చిన్నస్వామి ఘటనలో బెంగళూరు పోలీస్ కమిషనర్ బి. దయానంద్‌ను బదిలీ చేయడం సమంజసం కాదని ఐపీఎస్ మాజీ అధికారిణి కిరణ్ బేడీ అన్నారు. ఆమె స్పందిస్తూ.. 'రాష్ట్రంలో శాంతి భద్రతలు ప్రత్యేకమైనవి. ఏదైనా అనుకోని ఘటన జరిగినప్పుడు అసలు అక్కడ ఏం జరిగిందో చెప్పడానికి ఒకరు కావాలి. అధికారులు పోలీసుల వాదన కూడా వినాలి. ఈ ఘటనలో కమిషనర్ ఏమైనా అందరి అభిప్రాయాలను పెడచెవిన పెట్టారా? పోలీసు యంత్రాంగం మొత్తం నిర్ణయం తీసుకున్నప్పుడు ఒక్క కమిషనర్‌ను మాత్రమే ఎందుకు బాధ్యుడ్ని చేస్తారు?' అని ప్రశ్నించారు.



## భారత్ 'ఏ' 348 ఆలౌట్

నార్తాంప్టన్: ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న అనధికారిక రెండో టెస్టులో భారత్ 'ఏ' జట్టు ఆకట్టుకుంది. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు సన్నాహకంగా జరుగుతున్న ఈ పోరులో ఓవర్‌నైట్ స్కోరు 319–7తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన టీమ్ఇండియా 348 పరుగులకు ఆలౌటైంది. సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ సెంచరీతో రాణించగా, మిగతా వాళ్లు బ్యాట్లు ఝులిపించలేకపోయారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ ఏ.. 192/3 పరుగుల స్కోరు చేసింది. ఎమిలియో (71) రాణించాడు.

# భారత ఆర్చర్ల వైఫల్యం

**రికర్వ్‌లోనూ తప్పని నిరాశ**

అంటాల్య(టర్కీ): గత నెలలో షాంఘైలో జరిగిన ఆర్చరీ ప్రపంచకప్‌లో రెండు స్వర్ణాలు సహా రజతం, నాలుగు కాంస్య పతకాలతో సత్తాచాటిన ఆర్చర్లు.. అంటాల్యలో జరిగిన వరల్డ్ కప్ స్టేజ్–3లో మాత్రం రిక్తహస్తాలతో వెనుదిరిగారు. కాంపౌండ్ ఆర్చర్లు నిరాశపరిచిన వేళ భారీ ఆశలతో బరిలోకి దిగిన రికర్వ్ ఆర్చర్లు పోడియం ఫినిష్ లేకండానే పోరాటాన్ని ముగించారు. శనివారం వేర్వేరు విభాగాల్లో రికర్వ్ ఆర్చర్లు దీపికా కుమారి, తరుణ్‌దీప్‌రాయ్ మెడల్ రౌండ్‌కు అర్హత సాధించడంలో విఫలం కాగా, చివరి వరకు గెలుపు దోబూచులాడిన పోరులో సిమ్రన్‌జీత్ 5–6(29–28, 24–29, 27–24, 27–27, 23–29)(8–11)తో అన్ సన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడింది. పురుషుల విభాగంలో పార్థ్ సాలుంకే, అతాను దాస్, ధీరజ్ బొమ్మదేవర ప్రత్యర్థుల చేతుల్లో ఓడి నిష్క్రమించారు.



# బన్నీకి జోడీగా దీపిక

**ఇప్పుడున్న** పరిస్థితుల్లో అల్లు అర్జున్ సినిమా అంటే ఆడియన్స్‌లో ఎక్స్‌పెక్టేషన్లని అంచనా వేయలేం. బన్నీ స్టార్‌డమ్ ఆ స్థాయిలో పెరిగిపోయింది. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. తమిళ దిగ్గజ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించనున్న ఈ పాన్ ఇండియా యాక్షన్ అడ్వెంచర్ గురించి వచ్చే అప్‌డేట్ల కోసం సగటు ప్రేక్షకుడు సైతం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌ని శనివారం వెలుగుచూసింది. ఇందులో కథానాయికగా బాలీవుడ్ గ్లామర్ క్వీన్ దీపికా పదుకోన్ ఖరారైనట్టు మేకర్స్ శనివారం ప్రకటించారు. బిగ్గెస్ట్ విజువల్ వండర్‌గా రానున్న ఈ సినిమాలో అద్భుతమైన తారాగణం భాగం కానున్నట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ భారీ కాంబోను తెలియజేసేలా ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేశారు. డైరెక్టర్ అట్లీతో దీపికా పదుకోన్ మాట్లాడే సన్నివేశాలతో ప్రారంభమైన ఈ గ్లింప్స్, దీపిక శక్తివంతమైన పాత్రలోకి మారుతున్న తీరును ఆవిష్కరించింది. హెడ్ గేర్‌ను ధరించి ఆమె ఫుల్ కాస్ట్యూమ్స్‌తో ఓ యుద్ధానికి సన్నద్ధం అవుతున్నట్టు సెట్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. హృదయాలను హత్తుకునే భావోద్వేగాలు, రోమాంచితం చేసే యాక్షన్ సన్నివేశాలు, గ్రాండ్ విజువల్స్‌తోపాటు మన సంస్కృతికి అద్దం పట్టే కథతో గ్లోబల్ ప్రేక్షకుల్ని మెప్పించేలా ఈ సినిమా రూపొందనున్నదని, దీపికా పదుకోన్ భాగం కావడంతో ఈ ప్రాజెక్ట్ రేంజ్ మరోస్థాయికి చేరిందని, షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభిస్తామని, పూర్తి వివరాలు త్వరలోనే ప్రకటిస్తామని అట్లీ, కళానిధి మారన్ తెలియజేశారు.

చిత్రం



# 'కుబేర' మాటల ముచ్చట

'నాది నాది ఈ లోకమంతా నాదే..' అంటూ ఇటీవల విడుదలైన ఓ పాటతో 'కుబేర' సినిమా సారాంశాన్ని తెలియజెప్పే ప్రయత్నం చేశారు దర్శకుడు శేఖర్ కమ్ముల. ఈ ప్రపంచంలో వేళ్లూనుకుపోయిన స్వార్థం, దురాశ, ఆర్థిక అంతరాలను ప్రధాన వస్తువులుగా తీసుకొని ఆయన ఈ సినిమాను తెరకెక్కించారని అర్థమవుతున్నది. నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన 'కుబేర' ఈ నెల 20న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారపర్వంలో జోరు పెంచారు. తాజాగా ఈ సినిమాకు నాగార్జున డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ ఫొటోలను చిత్రబృందం పంచుకుంది. ఇప్పటికే విడుదలైన పాటలకు మంచి స్పందన లభిస్తున్నదని, సామాజికాంశాల మేళవింపుతో సోషల్ డ్రామాగా దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడని మేకర్స్ తెలిపారు. అమిగోస్ క్రియేషన్స్, ఎస్‌వీసీ పతాకాలపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మించారు.




# తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా సునీల్ నారంగ్

**తెలంగాణ** స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ప్రముఖ నిర్మాత సునీల్ నారంగ్ ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో కొత్త పాలక మండలిని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రవీంద్ర గోపాల, ఉదయ్‌కుమార్ రెడ్డి, కార్యదర్శిగా శ్రీధర్ వీఎల్, సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్ రావు, కోశాధికారిగా సత్య నారాయణ గౌడ్ ఎన్నికయ్యారు. వీరితో పాటు 15 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్‌ను ఎంపిక చేశారు. ఛాంబర్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని, బాధ్యతాయుతంగా పనిచేసి పరిశ్రమ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని సునీల్ నారంగ్ చెప్పారు. తెలుగు సినీరంగంలో ఓల్డెస్ట్ ఛాంబర్ ఇదేనని, ఇప్పుడు 80వ జనరల్ బాడీ మీటింగ్ జరిపామని కార్యదర్శి శ్రీధర్ వీఎల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెమినీ కిరణ్, సురేష్‌బాబు, కె.ఎల్.దామోదరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ఈ ఐదు నెలల్లో మూడే హిట్స్**

కార్యదర్శిగా ఎన్నికైనా శ్రీధర్ వి.ఎల్. మాట్లాడుతూ '2016 నుంచి పర్సంటేజీ సిస్టమ్ గురించి చాలా మీటింగ్స్ జరిగాయి. ప్రస్తుతం సింగిల్ స్క్రీన్స్ బంద్ అయిపోతున్నాయి. వాటిని రక్షించుకోవాలి. ఇక థియేటర్ల బంద్ గురించి మేమెప్పుడూ మాట్లాడలేదు. పర్సంటేజీ సిస్టమ్ అమలు చేయాలని ఫిల్మ్ ఛాంబర్‌ను కోరాం. మేము థియేటర్స్ బంద్ చేస్తున్నామని ఎవరికీ లెటర్లు కూడా ఇవ్వలేదు. ఇద్దరు దర్శకులు, ఇద్దరు నిర్మాతలు ఈ విషయంలో ఇష్యూ చేశారు. వారి పేర్లు భవిష్యత్తులో వెల్లడిస్తా. వాస్తవానికి పవన్‌కల్యాణ్ సినిమా వస్తున్నదని తెలిసి థియేటర్లని ఖాళీగా పెట్టుకున్నాం. ఈ నెల మొత్తం పోయింది. జనవరి నుంచి ఇప్పటివరకు సంక్రాంతికి వస్తున్నాం, మ్యాడ్ స్క్వేర్, కోర్ట్ ఈ మూడు చిత్రాలే హిట్ అయ్యాయి. ఈ మూడు సినిమాల మీదనే రెంట్ వర్కవుట్ అయింది. పరిస్థితి ఇలా ఉంటే.. అనవసరంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లను బ్లేమ్ చేస్తున్నారు. ఈ రోజు హీరోలు రెండేళ్లకో సినిమా చేస్తున్నారు. రెమ్యునరేషన్స్ అమాంతం పెంచుతున్నారు. మొన్న ఓ డిజాస్టర్ సినిమా హీరోకు 13కోట్ల రెమ్యునరేషన్ ఇచ్చారు. ఆ సినిమాకు వరల్డ్‌వైడ్ 2,3 కోట్ల షేర్ కూడా రాలేదు. ఇక నుంచైనా పెద్ద హీరోలు సంవత్సరానికి రెండు సినిమాలు చేయాలని కోరుతున్నా' అన్నారు.

# రాజమౌళి సినిమాలో?



**ప్రఖ్యాత** దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి 'ఆర్ ఆర్ ఆర్' సినిమా విడుదలై మూడేళ్లు నిండి, నాలుగో యేడు నడుస్తున్నది. ప్రస్తుతం ఆయన మహేశ్‌బాబు కథానాయకుడిగా సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇదో ట్రెజర్ హంట్ నేపథ్యంలో సాగే సాహసయాత్ర. ఈ చిత్రంలో మహేశ్‌కి జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు. మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఇందులో విలన్‌గా కనిపించనున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్‌లోకి మల్టీటాలెంటెడ్ యాక్టర్ మాధవన్ వచ్చి చేరారట. త్వరలోనే ఆయన ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ కానున్నారు. మరి ఇందులో మాధవన్ పోషించే పాత్ర ఏమిటి? అనేది తెలియాల్సివుంది. దాదాపు 600కోట్ల భారీ నిర్మాణ వ్యయంతో దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి స్వరకర్త. ఈ చిత్రానికి మాటలు: దేవకట్టా.

# మనసుని తాకే మై లవ్..




**ప్రతిష్ఠాత్మక** మెగా సూపర్‌గుడ్ ఫిల్మ్స్ సమర్పణలో తెరకెక్కిన మ్యూజికల్ లవ్ ఆల్బమ్ 'మై లవ్'. కిశోర్ తేజా, సాత్విక జంటగా నటించిన ఈ సాంగ్‌ని ఎస్.కె.టి. ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై వాకాడ అప్పారావు నిర్మించారు. సురేష్ బనిశెట్టి రాసిన ఈ పాటను, క్రాంతి ఆచార్య స్వరపరచగా, కపిల్ కపిలన్ ఆలపించారు. మ్యూజికల్ లవర్స్‌ని మెస్మరైజ్ చేసేలా ఈ పాట ఉంటుందని, యువజంట కిశోర్ తేజా, సాత్విక స్క్రీన్ కెమిస్ట్రీ లవ్లీగా ఉంటుందని, రామ్‌రెడ్డి పన్నాలా అద్భుతమైన కాన్సెప్ట్‌తో హార్ట్ టచ్చింగ్‌గా ఈ పాటను మలిచారని శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేకర్స్ తెలిపారు.



# ప్రేమ గమ్యం కాదు.. ఓ ప్రయాణం

**'మ్యాడ్'** ఫేమ్ అనంతిక సునీల్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కవితాత్మక ప్రేమకథా చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం టీజర్‌ను విడుదల చేశారు. 'అతను పదాలను ప్రేమతో రాస్తే తడిసిన గులాబీ పువ్వుల్లా ఉంటాయి. అదే కసితో రాస్తే పిన్ తీసేసిన గ్రెనేడ్‌లా ఉంటాయి' అనే వాయిస్ ఓవర్‌తో ఊటీ నేపథ్యంలో మొదలైన టీజర్ పొయెటిక్ ఫీల్‌తో ఆకట్టుకుంది. వర్షం, మంచు జడిలో తడిసిన ఊటీ ప్రాకృతిక సౌందర్యం తాలూకు విజువల్స్ కట్టిపడేసేలా ఉన్నాయి. 'ప్రేమ చేరుకోవడానికి ఓ గమ్యం కాదు. మనం చేయాల్సిన ప్రయాణం' అంటూ హార్ట్‌టచింగ్ మాటలతో టీజర్‌ను ముగించిన తీరు కథపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ వర్ష రుతువులో హృదయాల్ని స్పృశించే ప్రేమకథా చిత్రమని, చక్కటి కవితాత్మక భావాలతో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన–దర్శకత్వం: ఫణీంద్ర నర్సెట్టి.

# పూరి జగన్నాథ్ భవతీ భిక్షాందేహి?



**సినిమాలకు** భిన్నమైన పేర్లు పెట్టడంలో దిట్ట పూరీ జగన్నాథ్. తొలి సినిమా 'బద్రి' నుంచి చూసుకుంటే, దాదాపుగా ఆయన సినిమాల పేర్లన్నీ కొత్తగానే ఉంటాయి. ప్రస్తుతం విజయ్ సేతుపతి కథానాయకుడిగా ఆయన సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు ఎవరి ఊహలకూ అందని పేరుని అనుకుంటున్నారట పూరీ. వివరాల్లోకెళ్తే.. ఇది పానిండియా ప్రాజెక్ట్ కావడంతో.. 'బెగ్గర్' అనే పేరుని ముందు ఈ సినిమాకు టైటిల్‌గా అనుకున్నారట. అయితే.. ఆ టైటిల్‌కి విజయ్ సేతుపతి అభ్యంతరం చెప్పారట. 'బెగ్గర్' అనే టైటిల్ తెలుగులో అయితే ఓకే.. తమిళ ప్రేక్షకులు మాత్రం ఈ ఇంగ్లిష్ టైటిల్‌ని అంగీకరించరని ఆయన నిర్మొహమాటంగా చెప్పేశారట. పైగా 'పిచ్చైకారన్'(తెలుగులో 'బిచ్చగాడు') అనే సినిమా అక్కడ కూడా అఖండ విజయం అందుకున్న విషయం తెలిసిందే. అందుకే అదే అర్థం వచ్చేలా, అన్ని భాషలకూ సరిపోయేలా ఓ మంచి టైటిల్ అనుకోండని విజయ్ సేతుపతి సలహా ఇచ్చారట. దాంతో.. అన్ని భాషలకూ కలిసొచ్చేలా 'భవతీ భిక్షాందేహి..' అనే టైటిల్‌ని అనుకుంటున్నారట పూరీ. 'భవతీ భిక్షాందేహి' అనేది సంస్కృత పదం కాబట్టి, ఏ భాషలోనూ సమస్య రాదని పూరీ ఆలోచన. మరి ఈ టైటిల్ ఖరారవుతుందా? లేదా? అసలు ఈ వార్తలో నిజం ఉందా? లేదా? ఈ ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

# అమ్మకు ఓ బహుమతి



**తన** తాజా చిత్రం 'సితారే జమీన్ పర్'కు సంబంధించిన ఓ సర్‌ప్రైజింగ్ వార్తను వెల్లడించారు అమీర్‌ఖాన్. ఇందులో ఆయన తల్లి జీనత్ ఖాన్ ఓ అతిథి పాత్రలో మెరిసిందట. ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో అమీర్‌ఖాన్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఇప్పటివరకు అమ్మ నా సినిమా సెట్‌లోకి రాలేదు. కానీ ఆశ్చర్యంగా ఓరోజు తను ఫోన్ చేసి 'ఎక్కడ షూటింగ్ చేస్తున్నావు. నేను రావొచ్చా' అని అడిగింది. వెంటనే కారు పంపించాను. చెల్లెలు నిఖత్‌తో కలిసి అమ్మ షూటింగ్ లొకేషన్‌కు వచ్చింది. ఆ సమయంలో ఓ వెడ్డింగ్ సాంగ్ షూట్ చేస్తున్నాం. అంతలోనే దర్శకుడు ప్రసన్న వచ్చి 'మీ అమ్మగారిని ఈ సీన్‌లో చూపిద్దామా? తన పర్మిషన్ అడగొచ్చా? అన్నాడు. ఇద్దరం వెళ్లి అమ్మను అడగ్గా తను ఆనందంగా ఓకే చెప్పింది. నేను ఒక్కసారిగా షాక్ తిన్నాను. పాటలోని రెండుమూడు సీన్స్‌లో అమ్మ కనిపిస్తుంది. నా సినిమాలో తొలిసారి అమ్మ భాగం కావడం నిజంగా గొప్ప అదృష్టం. ఇది అమ్మకు ఇచ్చిన ఓ బహుమతి' అంటూ మురిసిపోయారు అమీర్‌ఖాన్. ఈ నెల 20న 'సితారే జమీన్ పర్' విడుదలకానుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.